ఏకోదరులు

వేమూరి వెంకటసూర్యనారాయణ

"అరగంటనుండి చెప్తూన్నా, 'పుస్తకం తియ్యకుండా అలా ముడిచిపెట్టుకొని పడుక్కుంటావేమిరా?"

రంగారావుకి అన్న మాటలు వినబడుతూన్నా, తనను కానట్టే ముసుగు మరింత బిగించుకుని పడుకున్నాడు.

"వెధవ! చదవకుండా ఎన్నాళ్ళీ క్లాసులో కూర్చుంటాడు?" అని విసుక్కుంటూ జగన్నాథం తను చదువుతూన్న పుస్తకాన్ని అక్కడపెట్టి లేచి, తమ్ముడు పడుకున్న మంచందగ్గిరకెళ్ళి కప్పుకున్న దుప్పటీని లాగివేసి, రంగా[illegible] లేవదీసి మంచంమీద కూర్చోపెట్టాడు [illegible]ఖమయమైన సుషుప్తికి భంగం కలిగినందుకు రంగారావు కొంచెం గొణుక్కున్నాడు.

"మొహం కడుక్కుని కూర్చోరా, నిద్ర మత్తువదిలిపోతుంది" అంటూ గ్లాసులో మంచినీళ్ళుపోసి తమ్ముడిచేతి కందించాడు జగన్నాథం.

ఇంక తప్పదనుకుంటూ రంగారావు మంచంమీదనుండి లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ వాకిట్లోకి వెళ్ళి ముఖం కడుక్కుని తిరిగి వచ్చి దీపం ముందు కూర్చున్నాడు.

ఇద్దరికీ మధ్యనున్న హరికేన్‌లాంతరు జాజ్వల్యమానంగా వెలుగుతోంది. జగన్నాథం దీక్షగా చదువుతున్నాడు. రంగారావుకి మాత్రం చదవబుద్ధి కావడం లేదు. చేతులో పుస్తకం వుందికాని, బద్ధకంగా జోగుతున్నాడు. తల పైకెత్తి చూసిన జగన్నాథానికి తమ్ముడు బద్ధకంగా జోగుతూ వుండడం కనిపించింది.

రంగారావు తెలివైనవాడే. ఎంత తెలివైనవాడయితేమాత్రం ఒక్కసారైనా పుస్తకం ముట్టుకోకపోతే – ఆ చదువు అబ్బుతుందా? అతనికంటె మొద్దులు 'నా బొంద' అని యిరవై నాలుగ్గంటలూ పుస్తకాలు ముందుపెట్టుకొని రంగారావుకంటే తెలివైనవాళ్ళుగానే ఉపాధ్యాయులదృష్టిలో చలామణీ అవుతున్నారు. రంగారావుమాత్రం ఒళ్ళువంచి చదివినా పరీక్షల్లో మంచిమార్కులు రావడానికి అవకాశముంది. కాని అతను పరమబద్ధకస్తుడు.

జగన్నాథానికి తమ్ముడి బద్ధకం చూస్తూంటే అమితమైన కోపమూ, నిష్కారణంగా పాడైపోతాడేమోననే భయమూ మనసులో పెనవేసుకున్నాయి. తనంటే వాడికెంతో అభిమానమూ, గౌరవమూ ఉన్నాయి. కాని భయంలేదు. వాడికి కొంచెం భయం కలిగించి లొంగదీసుకోవాలనే ఉద్దేశ్యంతో జగన్నాథం తమ్ముణ్ణి చూచి ఒక్క లెంపకాయ కొట్టేడు.

నిద్రమత్తులో జోగుతూన్న రంగారావు ఆవూపుతో ఎగిరి వెళ్ళి బాగా వేడెక్కివున్న లాంతరుమీదపడ్డాడు. ఒళ్ళు చురుక్కున బాధతో మత్తు పూర్తిగా వదిలిపోయి 'అమ్మా!' అని కేక వేశాడు. ఈ హఠాత్సంఘటనకు జగన్నాథం బిత్తరపోయి గబగబా దీపంతీసి దూరంగా పెట్టాడు. తమ్ముణ్ణి కూర్చోపెట్టి కొబ్బరినూనె, సున్నపు నీరూ కలిపి కాలినచోట పట్టించాడు.

చాలాసేపటినుండి వెలుగుతూ తీవ్రంగా వేడెక్కిపోయిన లాంతరుమీద జబ్బబలంగా మొగ్గడంవల్ల రూపాయికాసంత మేర కాలిపోయి చర్మం ఊడిపోయింది. తమ్ముడి చేతిమీద ఆగాయాన్ని చూడగానే జగన్నాథం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. దీనంగా తమ్ముడి ముఖంలోకి చూస్తూ, 'తమ్ముడా ఇలా అవుతుందనుకోలేదురా. నువ్వు చదువుకోడంలేదనే బాధకొద్దీ, నీక్లాసులో చవటలంతా నీకంటె తెలివైనవాళ్ళుగా చలామణి అయిపోతున్నారనే యీర్ష్యకొద్దీ నీలోని పౌరుషాన్ని మేల్కొలుపుదామనే ఆశతో నిన్ను కొట్టేను. కాని యిలా అవుతుంది అనుకోలేదు" అన్నాడు మ్లానవదనంతో.

రంగారావు అన్న ముఖంలోకి ఆప్యాయంగా చూశాడు. తన అన్న తనగూర్చి మనసులో పడేక్షోభ ముందు తన చేతిమీద కాలిన గాయంవల్ల కలిగేబాధ యేమాత్రం? కేవలం విస్మరించతగినదే. అసలే తన అన్నది జాలిమనసు. అందుకే యీచిన్న సంఘటనకు యిలా బాధపడుతున్నాడు. ఆక్షణంలో అన్నపైనుండే ప్రేమానురాగాలూ, భక్తిభావమూ ద్విగుణీకృతంగా అతని హృదయంలో విజృంభించాయి.

"అన్నయ్యా!" అంటూ జగన్నాథంమీద వాలిపోయాడు.

"ఇకముందు జాగ్రత్తగా చదువుకుంటానన్నయ్యా! నీమనసును కష్టపెట్టనన్నయ్యా" అన్నాడు.

జగన్నాథం ప్రేమతో రంగారావు శిరస్సును హృదయానికి చేర్చుకున్నాడు.

జగన్నాథం రాజమండ్రి ఆర్ట్సు కాలేజీలో బి. ఏ. పరీక్షకు చదువుతున్నాడు. రంగారావు వీరేశలింగం హైస్కూలులో స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు. ఇద్దరూ ఆల్కాట్ తోట ప్రాంతంలో చిన్నయిలు తీసుకుని వుంటున్నారు. జగన్నాథం స్వశక్తివల్ల రెండు మూడు స్కాలర్‌షిప్పులు సంపాదించుకున్నాడు. వాటిమీద వచ్చే ఆదాయంవల్లనే అన్నదమ్ములిద్దరి చదువూ సాగుతూంది. లేకపోతే పల్లెటూళ్ళో చేరెడు భూమిని సేద్యం చేసుకుంటూ బ్రతుకుతూన్న తల్లిదండ్రులు వాళ్ళకెలాగూ ఉన్నత విద్య చెప్పించలేరు.

స్వతహాగా జగన్నాథం తెలివైనవాడు. తన తెలివితేటలకు తోడు నిరంతరమయిన కృషివలన విద్యారంగంలో సానపెట్టిన వజ్రంలా తయారయాడు. తల్లిదండ్రులు తప్పితే తననూ, తమ్ముణ్ణీ స్వచ్ఛమయిన మనస్సుతో ఆదరించేవారెవరు లేరు. ఆ తల్లిదండ్రులు ఉన్నవాళ్ళు కాకపోవడంవల్ల తాము జీవితంలో పురోగమించడానికి వాళ్ళ ఆదరణ ఏవిధంగానూ చేయూతనివ్వలేదు. అందుకే జగన్నాథానికి చిన్నవయసులోనే బాధ్యతల బరువు తెలిసివచ్చింది. తాముండే పరిస్థితుల్ని అర్థం చేసుకోకుండా, తమ్ముడు తన కనీసపు బాధ్యతలను విస్మరించి ప్రవర్తించడం జగన్నాథానికి ఉక్రోషాన్ని కలుగజేసేది. కాని కొద్దికాలం క్రితం జరిగిన సంఘటనతో రంగారావు కొంచెం మారినట్టే కనిపించాడు. అతను అప్పుడప్పుడు ఏ పనిలోనయినా బద్ధకించినా, చేతిమీద శాశ్వతంగా ఏర్పడిన రూపాయి కాసంత మచ్చ తన బాధ్యతలను

2

[illegible]

[illegible] కొద్ది రోజులు మాత్రమే వున్నాయి. రంగారావూ, జగన్నాథం— యిద్దరూ పెద్దపరీక్షలకు హాజరు కావలసిన వాళ్ళే. అందుచేత మామూలుకంటె ఎక్కువ కాలాన్ని చదువుక్రింద వినియోగిస్తున్నారు. ప్రతి రోజూ తెల్లవారుఝామునే లేచి ప్రశాంత వాతావరణంలో చదవడం మొదలు పెట్టారు. ఒకనాడు మామూలుగానే లేచి వసారాలో కూర్చొని యిద్దరూ చదువు కొంటున్నారు. హరికేన్ లాంతరు వెలుతురు వసారా నిండా పరుచుకొంది. ఒకటి రెండు కాంతిరేఖలు వీధి మెట్లమీదకుకూడా ప్రసరిస్తున్నాయి. వీధి మెట్లమీద మిగిలిన స్థలమంతా చీకటిగా వుంది. ఇద్దరూ దీక్షగా చదువుతున్నారు.

వీధి మెట్లమీద ఏదో చప్పుడి అయింది! జగన్నాథం అటుతిరిగి చూశాడు. అక్కడ ఏదో ఆకారం కదులుతున్నట్లు కనిపించింది.

"విధవ కుక్కలు ఎప్పుడూ మనగుమ్మంలోనే ఏడుస్తాయి," అన్నాడు రంగారావు యథాలాపంగా.

జగన్నాథం ప్రక్కనున్న చేతికర్రను తీసి, కుక్కను కొట్టే ఉద్దేశంతో కదులుతున్న ఆ ఆకారంమీదికి బలంగా విసిరాడు. హృదయాలను పిండిచేసే దీనమైన ఆర్తనాదం, తలమీదపడ్డట్లు 'దబ్బు'మనే చప్పుడూ ఒకదానివెంట ఒకటి వినిపించాయి.

అన్నదమ్ములిద్దరూ గాభరాగా లేచి దీపంపట్టుకొని గడపలోకి వెళ్లారు. అక్కడ చూసిన దృశ్యానికి వాళ్లు భయంతో కంపించిపోయారు. సుమారు ఏభైఏళ్ళ వ్యక్తి మెట్లమీద ఏటవాలుగా పడివున్నాడు. అతని జీర్ణవసనాలూ, చంకనున్న జోలె, వీపుకంటుకొనిపోయిన పొట్టా - అతడు ముష్టివాడైనట్లు సూచిస్తున్నాయి. జగన్నాథం విసిరిన చేతికర్ర బలంగా మర్మస్థానంమీదతగలడంవల్ల వెంటనే ప్రాణంవిడిచేశాడు. ఈ దృశ్యాన్ని చూసిన జగన్నాథం నిలువునా కంపించి పోయాడు. శరీరమంతా కమ్మిన చెమటతో అతని దుస్తులు పూర్తిగా తడిసి ముద్దయిపోయాయి. నిశ్చలంగా, వెర్రిగా, భయం భయంగా చూస్తున్నాడేగాని అతనిలో చైతన్యం లేదు.

రంగారావు జగన్నాథంకంటె బాగా ధైర్యస్థుడు. చెదిరిన మనస్సును కొద్దిక్షణాల్లోనే కూడదీసుకున్నాడు. తరణోపాయంకోసం అతని మెదడు విద్యుద్వేగంతో పని చెయ్యడం మొదలుపెట్టింది. టక్కున జగన్నాథం చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకు వెళ్ళాడు. "గత్యంతరం ఆలోచించాను," అన్నాడు, రహస్యంగా.

జగన్నాథం వెర్రిగా చూశాడు.

"నే నిక్కడినుండి పరారి అయిపోతాను. నేరం దానంతటదే నామీదకు తోసుకు పోతుంది" రంగారావు నిశ్చలంగా చెప్పాడు.

"నువ్వా!!" అన్నాడు, జగన్నాథం బలవంతంగా తేరుకుని.

"అవును. నేనే. ఈ పరిస్థితుల్లో నేను పారిపోవడమే ఉత్తమం. నువ్వు నాకంటె ఎక్కువ చదువుతున్నవాడివి, తెలివైనవాడివిను, పైగా నాకు ఉచిత భోజన సౌకర్యం ఉండడంవలన నీ చదువు సుళువుగా కొనసాగిపోతుంది. సంఘంలో ఉన్నత స్థానానికి చేరగల అవకాశాలు నాకు లేవు. త్వరగా చదువు పూర్తి చేసుకుని మన తల్లి దండ్రులను ఆదుకునే ఆవశ్యకం నీకెక్కువగా వుంది. అందుచేత ఈ పరిస్థితుల్లో నాకంటె నీకే ఎక్కువ రక్షణ కావలసి వుంది. ఏమీ తెలియనట్లే నువ్వు రోజులు గడిపి వెయ్యి. కొన్నాళ్ళకు పరిస్థితులు వాటంతటవే సర్దుకుంటాయి. ఈ తరుణంలో నీ భవిష్యత్తుకు గండిపడడం మన కుటుంబానికి క్షేమం కాదు. నేను వెళ్తున్నాను. బహుశా యిదే మనకు ఆఖరి చూపు లేమో!"

"తమ్ముడూ! వద్దు. నేరం నీమీద వేసుకుని నువ్వు పారిపోవడానికి వీలులేదు. నేరం నాది, శిక్ష నీదివా? వొద్దు తమ్ముడూ!" అంటూ జగన్నాథం తమ్ముణ్ణి [illegible] కౌగలించుకున్నాడు.

రంగారావు మృదు[illegible]

నుండి తప్పించుకుని, "నిన్ను బ్రతిమాలుకుంటున్నాను. నన్ను వెళ్ళనీ అన్నయ్యా! నిదానంగా ఆలోచిస్తే నేను చెప్పినదాల్లో సత్యాసత్యాలు నీకే అర్థమవుతాయి. మనం యిప్పుడీ సమస్యను తర్కిస్తూ కాలయాపన చెయ్యడానికి వేళ లేదు. నేనింకా మైనర్ని గనుక పట్టుబడినా పెద్ద శిక్ష విధించరు నువ్వు మాత్రం ధైర్యంగావుండు. ఏ పరిస్థితుల్లోనూ నిజాన్ని వెల్లడి చెయ్యడానికి ప్రయత్నించకు" అంటూ తలుపు తెరచుకొని చీకట్లో లీనమయిపోయాడు.

"తమ్ముడూ!" అంటూ జగన్నాథంపిలుపు అక్కడికక్కడే గాలిలోలీనమై పోయింది.

రంగారావు వెళ్ళిపోయినతరువాత నిదానంగా ఆలోచిస్తే జగన్నాథానికి తమ్ముడు చెప్పిన మాటల్లో పరిస్థితుల్ని అకళింపు చేసుకొన్న పచ్చినిజం ఉన్నట్లు అనిపించింది.

తెల్లవారేసరికి ఆ యింటిముందు పోలీసు ఉద్యోగులూ, తమాషా చూడ్డానికి వచ్చిన జనమూ నిండిపోయారు. శవాన్ని పంచాయితీచేసిన పెద్దలు అది 'హత్య' అని నిర్ణయించారు. పోలీసుద్యోగులు జగన్నాథాన్ని గంటలకొద్దీ తమ ప్రశ్నలతో వేధించారు. ప్రతి ప్రశ్నకూ ఓపిగ్గా "నాకు తెలియదు" అని జవాబిచ్చాడు జగన్నాథం.

అతని జవాబులతో విసిగిపోయిన పోలీసు అధికారి చివరిప్రయత్నంగా యిలా అడిగాడు—

"ఈ యింట్లో ఎవరెవరుంటున్నారు?"

"నేనూ, మా తమ్ముడూ."

"మీ తమ్ముడేడీ?"

"రాత్రినుండి కనబడ్డంలేదు."

ఆ ఉద్యోగి మనస్సులో ఏదో ఆలోచన తళుక్కున మెరిసింది. "ఇంకేం-'ఆ తమ్ముడే హత్య చేసి పరారిఅయిపోయాడన్నమాట!" అనుకున్నాడు.

అంతటితో వాళ్ళంతా జగన్నాథాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయారు. ఇంక తన తమ్ముడ్ని వేటాడుతారు కాబోలు అనుకున్నాడు, జగన్నాథం. వాడెటుపోయాడో, ఎక్కడున్నాడో!

ఇది జరిగిన రెండు రోజులకు ధవళేశ్వరం ఆనకట్టదగ్గర ఒక కుర్రవాడిశవం గోదావరిలో



ఇంతలో ఎవరో పెద్దమనిషి రావడంవల్ల జడ్జీగారు ఆయనతో మాట్లాడ్డంలో నిమగ్నులయి పోయారు. సోమయ్య చిన్నబోయిన ముఖంతో అక్కడినుండి కదిలాడు.

విశేష మేమిటంటే, సోమయ్య కదలకుండా తన యింటిముందే వుండడాన్ని జడ్జీగారు వరుసగా రెండురోజులు గమనించడమూ, మూడోనాడు అతన్ని పిలిచి తన దగ్గర బంట్రోతుగా నియమించడమూ జరిగింది. ఆరోజునుండి సోమయ్య జడ్జీగారి యింటిని కనిపెట్టుకునే వుండేవాడు. నాగులు ఊళ్లో కూలీనాలీ చేసుకునేవాడు.

కొద్దిరోజుల్లోనే సోమయ్య జడ్జీగారికి అభిమానపాత్రుడయిన నౌకరు అయాడు. ఆయనకు కావలసిన ప్రతిపనినీ భక్తితో నిర్వహించేవాడు, ప్రతి సదుపాయాన్నీ శ్రద్ధతో చేసేవాడు. ఇరవైనాలుగ్గంటలూ అయన్నే కనిపెట్టుకుని వుండేవాడు.

జడ్జీగారు సోమయ్యను గురించి అప్పుడప్పుడాలోచిస్తూ వుంటారు—ఎంతమంచివాడతను! తానంటే ఎంత గౌరవాభిమానాల్ని చూపుతున్నాడు! మొదట్లో తానతన్ని చూసినప్పుడు ఎవడో బిచ్చగాడని భ్రమపడ్డాడు గాని, పరిశీలిస్తే జీవితంలో పెద్ద దెబ్బతిని యీ స్థితికి వచ్చినట్టు కనబడుతున్నాడు. అందుకే కాబోలు తాను మొదట్లో రూపాయితీసి యిచ్చినప్పుడు తీసుకోకుండా ముఖం చిన్నపుచ్చుకున్నాడు. అతనిలో గతించిన అభిజాత్యపు వాసనలు యింకా ఆత్మాభిమానాన్ని కాపాడుతున్నాయి కాబోలు!

ఒకనాడు రాత్రి జడ్జీగారు క్లబ్బునుండి యింటికి వస్తున్నారు. ఆనాడు క్లబ్బు వార్షికోత్సవం గనుక అక్కడ బయలుదేరేసరికే సుమారు పదకొండు గంట లయింది. డ్రైవరు సాయంత్రమే యింటికివెళ్ళిపోవడంవలన ఆయనే కారు నడుపుతున్నారు. సోమయ్య వెనుకసీటుమీద ఆనీ ఆనునట్లు కూర్చుని వున్నాడు. బందరులో రాత్రి ఎనిమిదిగంటలయితేనే రోడ్లన్నీ నిర్మానుష్యంగా వుంటాయి. పదకొండు గంటలవడంవలన మరీ శూన్యంగా వున్నాయి. జడ్జీగారు నడుపుతూన్న కారు మెల్లగా మెత్తగా తార్రోడ్డుమీద ముందుకి సాగిపోతూంది.

కారు మలుపు తిరుగుతూంది. చావుకేక వేసి ఒక మానవాకారం 'దబ్బు'మని నేలకూలడమూ, మరో వ్యక్తి మసక చీకటో మాయమవడమూ క్షణంలో జరిగిపోయాయి. బలిష్ఠమయిన కండలు తిరిగిన వ్యక్తి మసక చీకటో మాయమవడం జడ్జీగారికీ, సోమయ్యకూ కూడా స్పష్టంగా కనుపించింది.

జడ్జీగారు కారు ఆపారు. "సోమయ్యా! అలా వెళ్లి ఎవరైనా బీటుజవాను కనిపిస్తే ఈ స్థలానికి పంపి, నువ్వు ఇంటికి వచ్చెయ్యి" అని ఆయన కారు తీసుకుని యింటికి వెళ్ళిపోయారు.

హత్యానేరంమీద మర్నాడు నాగులు అరెస్టు చెయ్యబడ్డాడు. ఆ వార్త తెలిశాక సోమయ్య జడ్జీగారి ముందు వాపోయాడు, "వాడికేం తెలియదు బాబూ!" అని జడ్జీగారు నిర్లిప్తంగా సోమయ్య గోడును ఆలకించి ఊరుకున్నారు.

నాగులుమీద మోపబడిన హత్యాభియోగం సెషన్సుకోర్టుకి పంపబడింది. జస్టిస్ జగన్నాథంగారి ఎదుట కేసు మూడు వాయిదాల్లో కూలంకషంగా చర్చింపబడింది. ప్రాసిక్యూషనువారు ముద్దాయిని హంతకునిగా ఋజువుపరచే బలవత్తరమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టారు.

"నేనేపాపం ఎరుగను బాబూ! నన్నన్యాయంగా పట్టుకుని కటకటాల వెనుక త్రోసేశారు బాబూ!" అని బోనులోనున్న ముద్దాయి నాగులు హృదయవిదారకంగా ఏడిచాడు. వాడి తరఫున ప్లీడరెవరూ లేరు. అందుచేత వాడి యేడుపు వాడు యేడ్వవలసిందే!

కోర్టులో అంతా నాగులు నేరం ఋజువైపోయినట్లూ, అతనికి శిక్షపడక తప్పదనీ రూఢిచేసుకున్నారు. అప్పుడే శిక్ష యేరూపంలో వుంటుందో తెలుసుకోవటానికి మాత్రమే కాచుకొనివున్నారు. కోర్టుహాలులో ఒకమూలగా నిల్చున్న సోమయ్య బలవంతంగా కన్నీటిని ఆపుకుంటున్నాడు.

కేసుయొక్క అంతిమ పరిష్కారం మరునాటికి వాయిదా వెయ్యబడింది.

ఆరోజు జడ్జీగారు తన గదిలో ఒంటరిగా కూర్చొని కోరు కాగితాలు చూసుకుంటున్నారు. సోయయ్య అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి ఆయన ముందు నిలబడ్డాడు. అతని కళ్ళనుండి ధారాపాతంగా అశ్రుజలం ప్రవహిస్తోంది. అవనతవదనుడై వ్రాసుకుంటూన్న జడ్జీగారు తలఎత్తి సోమయ్య ముఖంలోకి జాలిగా చూశారు. నిస్తేజమయిన అతని ముఖంలో అంతులేని వ్యధ గోచరించింది.

"బాబూ! నాగులు నేరం చేశాడనే మీరూ అనుకుంటున్నారా?" అన్నాడు, సోమయ్య వెల్లుబికే దుఃఖాన్ని ఆపుకొంటూ.

జడ్జీగారు మాట్లాడలేదు. ఆయన ముఖంలో భావశూన్యత గోచరించింది. అవును. గురుతర బాధ్యతలు గలిగిన న్యాయాధికారిగా ఆయన అభియోగం పరిష్కారమయేవరకూ తన నిర్ణయాలను ఏవిధంగానూ బయల్పరుపకూడదు.

మనోవ్యగ్రతతో క్రుంగిపోతున్న సోమయ్యకు యిదంతా ఎందుకు? తన కొడుకు నిర్దోషి అని నచ్చచెప్పడానికే అతను ప్రయత్నిస్తున్నాడు.

"ఏం జరిగిందో చెప్తాను. వినండి బాబూ! ఖూనీ చెయ్యబడిన మనిషి మా నాగులు స్నేహితుడే! మాయిల్లు కూడా హత్య జరిగిన స్థలానికి దగ్గరగానే వుంది. అప్పుడే పడుకోడానికి సిద్ధపడుతూన్న నాగులు చావుకేకను విని హడావిడిగా ఆ స్థలానికి పరుగెత్తేడట. తీరాచూస్తే దెబ్బతిని పడిపోయినవాడు తన స్నేహితుడే! ఇంకా ప్రాణం వుందేమోననే ఆశతో పరీక్షిస్తున్నాడు. ఈలోగా పోలీసువాళ్లు వాణ్ణి పట్టుకున్నారు...వాడలాంటివాడు కాడు. కాడు బాబూ! మీ కాళ్ళు పుచ్చుకుని ప్రమాణం చేస్తాను. పుణ్యానికిపోతే పాపం ఎదురయింది." సోమయ్య ఆగి జడ్జీగారి ముఖంలోకి చూశాడు. తను చెప్పే కథనాన్ని ఆయన నిశ్చలంగా వింటున్నారు. ఆయన ముఖ కవళికల్లో ఏ మార్పూ లేదు. ఏ అర్థమూ లేదు

సోమయ్యలో ఉద్వేగం పెరిగిపోతూంది. అఖరి ప్రయత్నంగా జడ్జీగారి దగ్గరగా వెళ్ళాడు. తన కుడిచేతి మీదనున్న వస్త్రాన్ని తొలగిస్తూ ఆయన కళ్ళముందు ఆ చేతిని నిటారుగా చాపేడు. బిచ్చగాణ్ని మొదలు మహారాజాను వరకూ శాసించే అధికారం కలిగిన జడ్జీగార్ని ఆయన నౌకరు సోమయ్య గంభీరంగా ప్రశ్నించాడు—"ఈ మచ్చ జ్ఞాపక ముందా?"

ఆ చేతిమీద రూపాయి కాసంత కాలిన మచ్చ కనిపించింది జడ్జీగారికి. ఆయన కళ్ళముందు తన గత చరిత్రకు సంబంధించిన పుటలు గబగబా తిరిగి పాతిక సంవత్సరాల వెనుక ఆగాయి. ఆ సంఘటన ఆయనకింకా నిన్న మొన్ననే జరిగినంత వివరంగా జ్ఞాపకముంది. తను తమ్ముణ్ని లెంపకాయ కొట్టడమూ, వాడు వెలుగుతున్న దీపంమీద పడటమూ, వాడిచెయ్యి కాలి మచ్చ కటడమూ ఆ తరువాత దుర్విధి తమను వేరుచెయ్యడం - వరుసగా ఆయన కళ్ళముందు ప్రస్ఫుటీకరించాయి. ఆయన తన జీవితంలో మరిచిపోలేని విషయాలు—ఇవి. ఆయన ఒకసారి సోమయ్య ముఖంలోకి తీక్ష్ణంగా చూశారు. కూర్చున్న కుర్చీలోంచి గబుక్కున లేచి, "తమ్ముడూ!......నువ్వేనా, తమ్ముడూ!"

(42-వ పేజీ చూడండి)

శ్రీ కాఫ్
దగ్గు, ఉబ్బసములకు
దివ్యౌషధము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్, మద్రాసు-30

ఏకోదరులు

(31-వ పేజీ తరువాయి)

అంటూ తన హృదయానికి గాఢంగా హత్తుకున్నాడు. ఆయన కళ్ళవెంబడి ఆనందాశ్రువులు జలజల రాలాయి. సోమయ్య—సోమయ్య కాదు, రంగారావు—"అన్నయ్యా" అంటూ ఆయన హృదయం మీద వాలిపోయాడు. పాతిక సంవత్సరాల దీర్ఘ వియోగానంతరము కలుసుకొన్న ఏకోదరుల వక్షస్థలాలు ఒండొరుల ఆనందాశ్రువులతో తడిసిపోయాయి. ఆ స్థితిలో వారిద్దరూ ప్రపంచాన్నే మరచారు.

రంగారావు పారిపోయిన తరువాత గోదావరిలో ఒక శవం తేలడమూ, ఆ శవం రంగారావుదేనని తానక్కడ ఉన్నవారిని నమ్మ పెట్టడమూ ఎలా జరిగిందో జడ్జీగారు చెప్పారు.

"అందుకే నన్ను పట్టుకొనేందుకు ఎవరూ ప్రయత్నించినట్లు కనపడదు," అన్నాడు రంగారావు.

రంగారావు యీ యిరవై అయిదేళ్లలోనూ తన జీవితగమనం ఎలావుందో కథగా చెప్పేడు. ఆయన బదిలీమీద యీ వూరు వచ్చిన విషయం, పకోడీలు కట్టిన దినపత్రిక కాగితంలో తను చూసినట్టూ, అందుకే అన్నను వెతుక్కుంటూ వచ్చినట్లూ చెప్పాడు. దీర్ఘ వియోగానంతరం మనసులు విప్పి చెప్పుకుంటూన్న వాళ్లిద్దరూ తెల్లగా తెల్లవారే వరకూ కాలగమనాన్ని గుర్తించనేలేదు...

ఆరోజు నాగులు కేసులో తీర్పు చెప్పవలసిన దినం. జడ్జీగారు న్యాయపీఠాన్ని అధిరోహించారు. ఎసెసర్ సభ్యులు జడ్జీగారికి వెనుక వైపు వేదికమీద ఉపవిష్టులయారు. ముద్దాయి నాగులు రక్షకభటుల అధీనంలో ఒకవైపు నిల్చున్నారు. కోర్టు హాలు నిశ్శబ్దంగా వుంది.

జడ్జీగారు ఒకసారి కళ్లజోడు తీసి పాలో చనగా రుమాలుతో తుడిచి, మళ్ళీ తగిలించుకుంటూ గంభీరంగా యిలా అన్నారు:

"జెంటిల్ మెన్! మీరు యీ అభియోగాన్ని దానిమీది ఆక్షేపణలను అర్థం చేసుకున్నారు, సాక్ష్యాలను ఆసాంతం విన్నారు. ఈ హత్యాభియోగంలో మీ అంతిమ నిర్ణయాలను రూపొందించుకుందుకు అవసరమయిన విషయ పరీక్ష ముగిసింది. మీ న్యాయ పరీక్షలో ఏవిషయంలో నయినా, ఏమాత్రం అనుమానమున్నా, ఆ అనుమానాన్ని అపరాధికి అనుకూలంగాఅన్వయిస్తూ, (బెనిఫిట్ ఆఫ్ డౌట్ను కలుగజేస్తూ) మీ అంతిమ నిర్ణయాలను వినిపించండి."

ఎసెసర్ సభ్యులు పరస్పరం చర్చించుకుందుకు వేదిక దిగి ప్రైవేటు గదిలోకి వెళ్లారు.

జడ్జీగారి మనసులో ఝంఝామారుతం వీస్తోంది. ఆయన గంభీరంగా ఆలోచిస్తున్నారు. ఆయన కళ్ళముందొక తులాయంత్రం కనిపిస్తోంది. దానికి రెండు తూనిక చిప్పలున్నాయి. ఒకదానిలో 'సత్యం' మరొకదానిలో 'సాక్ష్యం' ఉన్నాయి. మొగ్గ ఏ వైపున ఉన్నదో నని మీదనున్న ముల్లువైపు చూశారు. ముల్లు సాక్ష్యంవైపు మొగ్గుతూంది. సత్యానికి యీ బూటకపు ప్రపంచంలో తావులేదని తెలియజేస్తూన్నట్లు ముల్లు 'సాక్ష్యం' వైపే మొగ్గుతూంది.

ఆ రాత్రి జరిగిన సంఘటన యింకా తన మనస్సులో మెరుస్తూనే వుంది.

హత్యచేసి పారిపోతూన్న వ్యక్తిని తను కళ్ళారా చూడడం జరిగింది. వాడు మెలి దిరిగిన కండలతో భీకరంగా వున్నాడు. రమారమి ఆరడుగుల ఎత్తున్నాడు. నడివయసువానిలా కనబడాడు. వాడి రూపురేఖలు తన మనఃఫలకంమీద స్పష్టంగా ముద్రింపబడి యింకా చెరిగిపోలేదు. - కాని యిప్పుడు తన ఎదురుగా నిల్చున్న ముద్దాయి? ఇరవై ఏళ్ళయినా సరిగా నిండని అర్భకుడు. సంస్కారమూ, సరియైన పోషణా లేక, బడుగుదేహంతో బ్రతుకుతూన్న నిర్భాగ్యుడు. రూపురేఖల్లోనే వాళ్ళిద్దరికీ హస్తికీ మశకానికీ ఉన్న అంతరం వుంది. తను అసలు నేరస్థుణ్ణి కళ్ళారా చూడకపోతే సాక్ష్యాన్ని బట్టి యీ ముద్దాయే నేరస్థుడని నమ్మేవాడేమో! అయినా న్యాయానికి కళ్లు లేవు. చెవులే వున్నాయి. తీర్పుకి సాక్ష్యమేకదా ముఖ్యాధారం?

అయితే నేరం ఒకరిదీ, శిక్ష మరొకరిదీనా? ఆయన అంతరాంతరాల్లోని అంతర్వాణి ఏదో "అంతేకదా, మరి?" అని గొణిగింది. నేరం చేసేది ఒకడైతే దానికి శిక్ష అనుభవించేది మరొకడు — అనే విషయం తన జీవితసత్యాలలోనే యిమిడి వుంది. దానివల్ల కలిగే మనోవ్యథ కూడా తనకు బాగా అనుభవమే!—ఇలా ద్వైధీభావంలో పడ్డ ఆయన మనసు అల్లకల్లోలమవుతూంది.

ఎసెసరు సభ్యులు ఎవరిస్థలాల్లోకి వచ్చి వాళ్ళు కూర్చున్నాక జడ్జీగారు వాళ్ళవైపు ప్రశ్నార్థకంగా చూశారు.

"ముద్దాయి హంతకుడనే మేమంతా నమ్ముతున్నాము" అని వారు ఏకగ్రీవంగా తమ నిర్ణయాన్ని తెలియపరిచారు.

వారి నిర్ణయం ఎలా వుంటుందో జడ్జీగారికి ముందే తెలుసు. అందుచేత ఆయనేమీ ఆశ్చర్య పడలేదు. నిదానంగా, గంభీరంగా ఆయన తమ తీర్పును వినబర్చారు.

"ఎసెసర్ సభ్యుల నిర్ణయంతో నేనేకీభవించలేను. ముద్దాయిని నిర్దోషిగా పరిగణించి అతనిని విడుదల చేస్తున్నాను."

ఈ తీర్పును విన్న ప్రేక్షకులంతా ఆశ్చర్యపోయారు. జనంలో గుసగుసలు బయలుదేరాయి. ఈ తీర్పు వాళ్ళ అంచనాలకు అందడం లేదు. 'నాగులు వంటి హంతకుణ్ని' విచ్చలవిడిగా విడచిపెట్టెయ్యడం వాళ్ళ కిష్టంలేదు. నాగులే తప్పకుండా హత్యచేసివుంటాడనివాళ్ల దృఢమైననమ్మకం.

జడ్జీ గారు వేదిక దిగి తమ ప్రైవేటు గదిలోకి వెళ్లారు. ఆ క్షణంలోనే తమ పదవికి రాజీనామా కాగితం వ్రాశారు.

తనతీర్పు నిష్పాక్షికమే అయినా ప్రజల దృష్టిలోమాత్రం పాక్షికంగానే కనిపిస్తుంది, ప్రజల సానుభూతి లేనిపదవిని నిర్వహించడం తనకూ కష్టమే! నిజం తనకు తెలియకపోతే నిష్కారణంగా తన చేతులమీదనే తన తమ్ముడికి అన్యాయం జరిగిపోయేది. అలా అన్యాయం చెయ్యకుండా తప్పించుకోగలగడంలోనే తనకు తృప్తివుంది. ★